ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

శుక్రవారం 14 ఫిబ్రవరి 2025





సిలువ గుట్ట జాతర కార్యక్రమంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి



సిలువ గుట్ట జాతరలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ జగ్గారెడ్డిని ఆశీర్వదిస్తున్న పాస్టర్లు

సిలువ గుట్ట జాతరలో జగ్గారెడ్డి

జాతరలో పాల్గొని క్రైస్తవులు

అడిగిన పనులు చేయిస్తానన్న జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి నియోజకవర్గం కొండాపూర్ మండల పరిధిలోని గంగారంలో జరిగిన సిలువ గుట్ట జాతర ఉత్సవాల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ మేరకు సిలువ గుట్ట పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి జగ్గారెడ్డిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సిలువ గుట్ట అభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడకు వచ్చే భక్తుల కోసం మౌలిక వసతులు కల్పించేందుకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కాగా, సిలువ గుట్టపై వాటర్ ట్యాంక్ మరమ్మతు కోసం రూ.1.50 లక్షలు జగ్గారెడ్డి నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ వైప్రభ, కొండాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహులు, సునీల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ ప్రయాణం



- కులాలు, మతాలు, ప్రాంతాలు.. కావేవీ ప్రేమకు అడ్డు
- నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తున్న జంటలు
- పరస్పరం ఇష్టాఇష్టాలు, అభిప్రాయాలకు గౌరవం
- అర్థం చేసుకుంటేనే ప్రేమకు పరమార్థం
- నేడు ప్రేమికుల దినోత్సవం

7లో

పుకార్లను నమ్మబోం..

అపోహలకు తావివ్వం

- సమష్టిగా ఆలయాల అభివృద్ధికి కృషి
- మోతే గ్రామస్థుల తీర్మానం
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో గ్రామస్థుల్లో కదలిక

7



అట్టహాసంగా పాలిటెక్నిక్

క్రీడలు ప్రారంభం

- మూడురోజుల పాటు రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ

7

కమలాయపల్లి చెరువుశిఖం

కబ్జాపై ఫిర్యాదు

చేర్యాల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం కమలాయపల్లి గ్రామంలోని వగలరాయుని చెరువు శిఖం భూమిని దొమ్మాట గ్రామానికి చెందిన పలువురు రైతులు కబ్జా చేసి దున్నకం చేస్తున్నారని స్థానికులు గురువారం చేర్యాల తహసీల్దార్ సమీర్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు. నిబంధనలకు విరుద్ధంగా శిఖం భూమిలో చెట్లు తొలగించి పొలం అచ్చుకడుతున్నారని, కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆర్ఐ రాజేందర్‌రెడ్డి తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం కబ్జా తేలితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మా రూటే సపరేటు

- రెవెన్యూ శాఖలో వసూళ్ల పర్వం
- చేయి తడపనిదే పూర్తికాని రిజిస్ట్రేషన్లు
- మ్యుటేషన్, నో'డ్యూ', నాలా, పహానీ నకలు, పంచనామాలకూ ఆశిస్తున్న వైనం
- బేరసారాలతో ఏసీబీకి చిక్కుతున్న అవినీతి అధికారులు
- తహసీల్దార్ కార్యాలయాలపై పర్యవేక్షణ కరువు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 13: జిల్లాలో అవినీతికి పాల్పడుతున్న మరో రెవెన్యూ అధికారి ఏసీబీకి చిక్కాడు. చనిపోయిన భర్తకు సంబంధించిన భూమిని భార్య పేరిట చేయడానికి కూడా చేతులు చాపిన అవినీతి చేపను నిఘా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విధిగా చేయాల్సిన సేవలకు కూడా ధర నిర్ణయిస్తున్నట్లుగా మరోసారి ఈ సంఘటనతో రుజువైంది. ఇప్పటికే పలువురు తహసీల్దార్లు, ఆర్ఐలు ఏసీబీకి చిక్కగా.. తాజాగా దుబ్బాక ఆర్ఐ నర్సింహారెడ్డి వ్యవహరించిన తీరు మరింత చర్చనీయాంశంగా మారింది. వితంతువుపై మానవత్వం చూపించాల్సిన అధికారి లంచం అడగడం ఆ శాఖ పనితీరుకు అద్దం పడుతోంది.

జిల్లాలోని పలు తహసీల్దార్ కార్యాలయాలకు అవినీతి బురద పట్టుకుంది. సస్పెన్షన్లు, హెచ్చరికలు ఉన్నప్పుడే అప్రమత్తమవుతూ ఆ తర్వాత షరా'మామూలే' అన్నట్లుగా వ్యవహరించడం సాధారణమైంది. కొందరు తహసీల్దార్లు ప్రజోపయోగంగా ఉన్నప్పటికీ మరికొందరి తీరుతో ఆ శాఖ విమర్శలు మూటగట్టుకుంటోంది. ఓ పక్కన ఏసీబీకి పట్టుబడుతున్న మరోపక్క అవినీతి మరకలు అంటుకుంటూనే ఉన్నాయి.

పర్యవేక్షణ లేకనే ఇష్టారాజ్యం

తహసీల్దార్ కార్యాలయాలపై సరైన పర్యవేక్షణ లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఉన్న కలెక్టర్ పలువురు తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకున్నారు. ఎప్పటికప్పుడు చర్యలుంటే అవినీతి బెడద తగ్గే అవకాశం ఉంది. కానీ ఇటీవల కాలంలో శాఖాపరమైన చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రిజిస్ట్రేషన్లు, సర్టిఫికెట్ల మంజూరు తదితర విషయాలపై క్షేత్రస్థాయిలో నిఘా లేకనే లంచాల కోసం ప్రజలను పీడిస్తున్న పరిస్థితి నెలకొన్నదనే వాదన వినిపిస్తోంది. వారసత్వ ఆస్తిని మార్చడానికి కూడా రూ.లక్షల్లో లంచం అడుగుతున్నారంటేనే జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పోలీస్‌శాఖలో కమిషనర్, ఏసీపీలు స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేస్తుంటారు. అదే తీరుగా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, డీఆర్వో, ఆర్డీవోలు సైతం ఒకట్రెండు తహశీల్దార్ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీలు చేయడం వల్ల అవినీతిని నియంత్రించే అవకాశం ఉంటుంది.



ఆర్ఐ వెనుకున్నదెవరో..!

దుబ్బాక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రూ.లక్ష లంచం తీసుకుంటూ బుధవారం ఏసీబీకి పట్టుబడడంతో అనేక అంశాలు చర్చకు వస్తున్నాయి. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, మ్యూటేషన్ కోసం బాధితురాలు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్లుగా తెలుస్తోంది. దుబ్బాక తహసీల్దార్ కార్యాలయంలోని ఇతర అధికారులు, సిబ్బంది పాత్రపై కూడా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తన సమస్య గురించి ఆమె ఎవరెవరిని సంప్రదించింది.. వారు ఆశించిందేమిటి.. అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. పెద్దమొత్తంలోనే డిమాండ్ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

చేయి తడిపితేనే సంతకాలు

సాధారణ రిజిస్ట్రేషన్లలోనూ లంచం డిమాండ్ చేస్తున్నారు. ధరణి ఆపరేటర్లు, ప్రైవేట్ సిబ్బంది, అధికారుల డ్రైవర్లతోపాటు అనుబంధంగా ఉన్న మీసేవ కేంద్రాల నిర్వాహకులను కలెక్షన్ ఏజెంట్లుగా పెట్టుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. పహాణీ నకలుకు రూ.500 నుంచి రూ.2వేలు కూడా వదలడం లేదు. ఇక మ్యూటేషన్, వారసత్వ పేరు మార్పిడి, ఇతర లావాదేవీలను ఆయా భూముల విలువ ఆధారంగా మామూళ్ల వసూలు చేస్తున్నారు. చేర్యాల, కొమురవెల్లి, సిద్దిపేట అర్బన్, రాయపోల్, మద్దూరు, దుబ్బాక, అక్బరుపేట-భూంపల్లి, ములుగు, సిద్దిపేట రూరల్, మిరుదొడ్డి, నంగునూరు, బెజ్జంకి, కోహెడ, వర్గల్, అక్కన్నపేట, కొండపాక, కుకునూరుపల్లి తహసీల్దార్ కార్యాలయాలపై ఆరోపణలు ఉన్నాయి. ఆఫీసు ఖర్చులు, ఇతరత్రా వ్యవహారాల పేరిట వసూళ్లు చేస్తున్నట్లుగా చర్చ జరుగుతోంది. పహాణీ నకలు, ఫ్యామిలీ మెంబరు, కుల, ఆదాయ, నివాస వంటి పలు రకాల సర్టిఫికెట్ల మంజూరుకు డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులున్నాయి.

ఆయిల్‌పాం సాగుతో

అధిక లాభాలు

- జిల్లాలో 12,221 ఎకరాల్లో తోటల సాగు
- 167 మంది రైతులు 178.31 టన్నుల ఆయిల్ గెలల దిగుబడి
- సందేహాలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి
- ఉద్యానవనశాఖ జిల్లా అధికారి సువర్ణ



ఆయిల్‌పాం తోటలను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ జిల్లా అధికారి సువర్ణ

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పాం తోటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందొచ్చని హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ జిల్లా అధికారి సువర్ణ తెలిపారు. 'ఆయిల్‌పాం సాగుకు వెనుకంజ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనానికి జిల్లా ఉద్యానవన శాఖ, ఆయిల్‌ఫెడ్ అధికారులు స్పందించి సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు, పుల్లూరు గ్రామాల్లో ఆయిల్ పాం తోటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ మాట్లాడుతూ ఆయిల్ పాం గెలలు దిగుబడి వచ్చే సరికి అలస్యం అవుతుందని ఆందోళన చెందవద్దని తెలిపారు. జిల్లాలో 12,221 ఎకరాల్లో ఆయిల్ పాం తోటలు సాగుచేస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు 167 మంది రైతులు 178.31 టన్నుల ఆయిల్ గెలల దిగుబడి సాధించి లాభాలు గడిస్తున్నారని చెప్పారు. ఆయిల్ పాం మొక్కలకు సరిపడా నీళ్లు అందించాలని రైతులకు సూచించినట్లు చెప్పారు. జిల్లాలో మూడు నర్సరీల్లో 7.54లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు అధికారులను సంప్రదించి ఆయిల్ పాం మొక్కలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం ఆయిల్ తోటలకు సబ్సిడీ డ్రిప్ మరియు ఇతర పరికరాలు అందిస్తుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు చేర్యాల డివిజన్, సిద్దిపేట రూరల్, సిద్దిపేట అర్బన్ మండలాలు కె.కౌసల్య -7995807149, దుబ్బాక, గజ్వేల్ డివిజన్ డి.రమేష్-8977714436, హుస్నాబాద్ డివిజన్, చిన్నకోడూరు, నారాయణరావుపేట, నంగునూరు మండలాల్లో ఆర్.బాలాజీ-8977714428 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఆవిడ వెంట జిల్లా ఆయిల్‌ఫెడ్ అధికారి అనిల్‌కుమార్, హెచ్ఓలు, ఏఈవోలు తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

- రామారం రైస్‌మిల్లులో పట్టుకున్న విజిలెన్స్ అధికారులు
- పెద్ద మొత్తంలో పీడీఎస్ రైస్ రీసైక్లింగ్
- అనుమతి లేకున్నా ప్రభుత్వానికి బియ్యం సరఫరా



రామారం రైస్‌మిల్లులో రీసైక్లింగ్ చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాయపోల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి పెద్దఎత్తున రీసైక్లింగ్ చేస్తూ తిరిగి ప్రభుత్వానికి సరఫరా చేస్తున్న అక్రమ బియ్యం దందా గుట్టును విజిలెన్స్ అధికారులు రట్టు చేశారు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం రామారం శివారులోని సాయి మహదేవ్ రైస్‌మిల్లులో చోటు చేసుకుంది. ఈ దాడుల్లో 863 బ్యాగుల్లో సుమారు 431 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. విజిలెన్స్ అదనపు ఎస్పీ శశిధర్‌రాజు వివరాల ప్రకారం.. రామారం గ్రామంలోని సాయి మహదేవ్ రైస్‌మిల్లుకు సీఎంఆర్ అనుమతి నిలిపివేసింది. దీంతో ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం మిల్లింగ్ కోసం రైస్‌మిల్లుకు పంపడం లేదు. అలాగే పౌర సరఫరాల శాఖకు ఈ రైస్‌మిల్లు నుంచి బియ్యం సరఫరా చేయడం నిలిచిపోయింది. కానీ మిల్లు నిర్వాహకులు అనుమతి లేకుండా పెద్దమొత్తంలో పీడీఎస్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసి వాటిని మిల్లులో రీసైక్లింగ్ చేసి పలు జిల్లాలకు చెందిన రైస్‌మిల్లుల పేరు మీద ప్రభుత్వానికి సరఫరా చేస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున విజిలెన్స్ సిబ్బంది, స్థానిక పోలీసుల సహకారంతో రామారంలోని సాయి మహదేవ్ రైస్‌మిల్లుపై ఆకస్మికంగా దాడి చేశారు. దాడిలో 431 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తే.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి తనూజ, రాఘవేందర్, ప్రవీణ్, రాజిరెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజిలెన్స్ అదనపు ఎస్పీ శశిధర్‌రాజు

చేర్యాలలో పిచ్చుకల సందడి

చేర్యాలలో గురువారం సాయంత్రం పిచ్చుకల గుంపు సందడి చేసింది. రోబో 2.0 సినిమాను కళ్లముందు కదలాడేలా చేసింది. సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో వేలాది పిచ్చుకలు ఆకాశంలో ఆటవిడుపు చేశాయి. సుమారు 20 నిమిషాలకు పైగా రకరకాల ఆకారాలతో విహరించి కనువిందు చేశాయి. పిచ్చుకలను చూసి స్థానికులు మంత్రముగ్ధులయ్యారు. కొందరు తమ సెల్‌ఫోన్లలో చిత్రాలను బంధించారు.

– చేర్యాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి)







ఇచ్చిన హామీలను మరుస్తున్న పాలకులు

- ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చే వరకు ప్రజలకు ఆకర్షణీయమైన సంక్షేమ పథకాలు ఎరచూపి అధికారంలోకి వచ్చిన తర్వాత పాలకులు మరుస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. నేడు ప్రజల సమస్యలు పట్టించుకునే పాలకులు కరువయ్యారన్నారు. పార్లమెంట్‌లో ఉన్న ప్రజా ప్రతినిధులు సగానికి పైగా నేరచరిత్ర ఉన్న వారే కావడంతో ప్రభుత్వ అధికారులు చట్టాలను అమలు చేయడం లేదన్నారు. ప్రధాని తీసుకొచ్చిన కొత్త చట్టాలతో ప్రజలకు మేలు జరిగే అవకాశం లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలుచుకునేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బోయిని అశోక్, రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్, జాగీర్ సత్యనారాయణ, ఎడల వనేష్, కొమ్ముల భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్దన్, గోపి, సంజీవరెడ్డి, సుదర్శన్, గూడ పద్మ, సుదర్శనచారి తదితరులున్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హోర్డింగ్‌ను తొలగించిన హైడ్రా

రామచంద్రాపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : హైడ్రా అక్రమ నిర్మాణాలనే కాదు.. అనుతిలేని పెద్దపెద్ద హోర్డింగ్‌లను కూలుస్తుంది. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అవుటర్ రింగ్‌రోడ్డు(ఓఆర్ఆర్) ఎగ్జిట్ నంబరు 2 వద్ద ఉన్న ఓ హోర్డింగ్‌ను గురువారం హైడ్రా అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది కూల్చివేశారు.

స్నేహం కాస్త ప్రేమై.. కులాంతర వివాహం


మంత్రి దామోదర్ - పద్మిని దంపతులు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ శ్రీమతి పద్మినీలది కులాంతర ప్రేమ వివాహం. దామోదర్ ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్(సివిల్ ఇంజనీరింగ్) చదివే సమయంలో తనతోపాటు చదువుకునే క్లాస్‌మేట్ అయిన నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ మిత్రుడి ఇంటికి తరచూ వెళ్లేవారు. ఆ సమయంలో స్నేహితుడికి కజిన్ అయిన పద్మినితో దామోదర్‌కు పరిచయమైంది. తరచుగా కలుస్తూ ఉండడం వల్ల వారి స్నేహం కాస్త ప్రేమగా మారింది. ఈ తరుణంలో వీరిద్దరూ వివాహం చేసుకోవాలనుకున్నారు. దామోదర్, పద్మినీలిద్దరివి వేర్వేరు కులాలు.. ఇరువైపులా కుటుంబాలు ఒప్పుకోకవడంతో 1986-87లో వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. వీరికి 1994లో త్రిష అనే అమ్మాయి జన్మించింది.

- జోగిపేట, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి)

ఒక్కటైన జర్నలిస్టులు..


క్రాంతికిరణ్ పద్మావతి దంపతులు

అందోలు మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, పద్మలది ప్రేమ వివాహమే. క్రాంతికిరణ్ 2000-01 సంవత్సరంలో జెమిని/తేజ ఛానెల్‌లో జర్నలిస్టుగా పనిచేస్తున్న సమయంలో అనంతరపురం జిల్లా సోమందేపల్లికి చెందిన పద్మావతి ట్రైనీ జర్నలిస్టుగా చేరారు. క్రాంతికిరణ్‌కి పద్మతో వృత్తిపరమైన పరిచయం ఏర్పడింది. అదే సమయంలో 24 గంటల న్యూస్ చానెల్ ప్రాంభమైంది. ఈ సమయంలో క్రాంతికిరణ్ అందులో చేరగా, ఆయన సలహా, సూచన మేరకు పద్మావతి కూడా చేరారు. ఇలా వీరి మధ్య వృత్తిపరమైన పరిచయం కాస్తా సన్నిహితమై ప్రేమగా మారింది. వీరిద్దరూ వివాహం చేసుకుందామనుకున్నప్పటికీ ఇద్దరి కులాలు వేర్వేరు కావడంతో కొంతకాలం తర్జనభర్జన పడ్డప్పటికీ, ఇరువైపులా పెద్దలను ఒప్పించి మరీ 2006లో ఆదర్శ వివాహం చేసుకున్నారు. వీరికి 2011లో అశాంక్ అనే అబ్బాయి జన్మించాడు.

- జోగిపేట, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి)

ఎల్లలుదాటి... వివాహమాడి


ప్రకాశ్‌రెడ్డి, యూకోస్లై దంపతులు

గుమ్మడిదల మండలం అనంతారం గ్రామానికి చెందిన విప్ప ప్రకాశ్‌రెడ్డి బీటెక్ ఎంఎస్ పూర్తి తీసుకుని అమెరికాలోని కాలిఫోర్నియాలో ఒరాకిల్ సంస్థలో మేనేజర్ స్థాయి ఉద్యోగం చేస్తున్నాడు. అదే సంస్థలో జపాన్ దేశం టోక్యో నగరానికి చెందిన యువతి యూకోస్లై విధులు నిర్వహిస్తుంది. ఇద్దరి విధులు నిర్వహణలో ఒకరినొకరు పరిచయం అయ్యారు. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారి పెళ్లికి దారితీసింది. యూకోస్లై తన ప్రకాశ్‌రెడ్డితో పెళ్లికి తన తల్లిదండ్రులను ఒప్పించారు. ప్రకాశ్‌రెడ్డి వారి తల్లిదండ్రులకు ప్రేమ విషయం చెప్పగా కాస్త తటపటాయించిన చివరికి పెళ్లికి ఒప్పించారు. తెలుగు సంప్రదాయ పద్ధతులతో 2013 మే 30న సికింద్రాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వారి పెళ్లయింది. పెళ్లికి యువతి కుటుంబ సభ్యులు సైతం హాజరై ఆశీర్వదించారు. ప్రస్తుతం ఇద్దరూ అమెరికాలో ఉద్యోగం చేస్తుండగా, వారికి ఒక కుమారుడు. సమయం దొరికినప్పుడు స్వగ్రామం వచ్చి కుటుంబసభ్యులతో గడిపి వెళ్తారు.

- గుమ్మడిదల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి)

ప్రేమ ప్రయాణం




రెండు మనసుల మధ్య చిగురించే ప్రేమ కలకాలం కలిసుందామంటుంది. కులమని, మతమని, పెద్దలని పరీక్ష పెడుతుంది. ఈ ప్రేమ పరీక్షను ఎదుర్కొని పాసైతేనే పెళ్లితో నూరేళ్ల ప్రేమ ప్రయాణం మొదలవుతుంది. చాలా మంది ఈ అడ్డుగోడను అధిగమించేందుకు ఇంట్లో వాళ్లకు చెప్పకుండా వెళ్లి పోయి వివాహం చేసుకోవడం, ఆ తర్వాత కొన్నాళ్లకు పెద్దలతో కలిసి పోవడం, మరి కొన్ని చోట్ల ఎన్నాళ్లయినా ఎదురుచూసి పెద్దల ఆశీర్వాదంతోనే ఒక్కటవడం జరుగుతూనే ఉన్నాయి. అలా ప్రేమించుకుని వివాహ బంధంతో ఒక్కటై ప్రేమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్న జంటలు ఎన్నో .. వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ విశేషాలు మీకోసం..

పోరాటమే ఇద్దరినీ కలిపింది


పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నీలిమ దంపతులు

కులాలు వేరే అయినా బాసలు ఒక్కటయ్యాయి. సమాజం పట్ల వారిరువురిలో మెదలిన భావాలు ఏకీభవించాయి. భిన్న మనస్తత్వాలున్నా ఒక్కటిగా మారి వెంటనడిచేలా చేశాయి. ఓవైపు చదువులో రాణిస్తూనే విద్యార్థి ఉద్యమాలలో కీలకభూమిక పోషిస్తూ పోరాటాలు చేస్తున్న సందర్భంలో ఏర్పడిన పరిచయం స్నేహంగా మారింది. తదుపరి ప్రేమకు బీజం పడి నాలుగేళ్లపాటు ప్రేమ ప్రయాణం కొనసాగించారు. ఏడడుగులు వేసి మూడుముళ్ల బంధంతో ఒకటయ్యారు. తమ ప్రేమను తల్లిదండ్రులు నిరాకరించినా వారిని మెప్పించి, ఒప్పించి నిలబడ్డారు. ఒకరు రాజకీయంలో బిజీగా గడుపుతూ, మరొకరు విద్యాసంస్థల నిర్వహణ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఎంతోమంది విద్యాకుసుమాలను విరబూయిస్తున్నారు. వారే జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి - నీలిమ దంపతులు.

నేనే ప్రపోజ్ చేశా : పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నేను ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ పీహెచ్‌డీ, నీలిమ జేఎన్‌టీయూలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతుండగా ఎస్ఎఫ్ఐ ఆర్గనైజేషన్‌లో పనిచేశాం. విద్యారంగ సమస్యలపై ఉద్యమిస్తున్న సమయంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. సమాజం పట్ల కలిగిన భావాలు ఏకీభవించడం, ఇద్దరి లక్ష్యం ఒక్కటిగా ఉండటంతో ప్రేమకుదారి తీసింది. నేనే ఫస్ట్ నీలిమకు లవ్ ప్రపోజ్ చేయగా అంగీకరించింది. వివాహం చేసుకునేందుకు నిర్ణయించుకున్నప్పటికీ ఇద్దరి కులాలు వేరే కావడంతో పెద్దలు కొంత మేర నిరాసక్తత కనబరిచారు. ఇద్దరం ఇష్టపడ్డందున తల్లిదండ్రులు ఒప్పుకునేంత వరకు వేచి చూశాం. నాలుగేళ్ల పాటు ప్రేమ ప్రయాణం సాగింది. ఇప్పటిలాగా సెల్‌ఫోన్లు, వాట్సాప్ చాటింగ్‌లు ఏవీ లేనందున గ్రీటింగ్ కార్డుల ద్వారా మా అభిప్రాయాలు, అనుభూతిని పంచుకునేవాళ్లం. 1991లో ఖమ్మంలో స్టేజ్‌మ్యారేజ్ ద్వారా పూలదండలు మార్చుకున్నాం. నన్ను అర్థం చేసుకుని నా ప్రతీ విజయంలో వెన్నంటి ఉండి ప్రోత్సహిస్తున్న నీలిమ నాకు నిజంగా దేవుడు ఇచ్చిన బహుమతే. నాటి కాలం ప్రేమలో నమ్మకం, స్వచ్ఛత ఉండేది. కానీ ప్రస్తుతం కొంతమంది యువత ప్రేమ పేరిట అఘాయిత్యాలకు పాల్పడటం కలిచివేస్తుంది. మనిషికి ప్రేమ ఎంత ముఖ్యమో చదవడం, తల్లిదండ్రులను గౌరవించడం, జీవితంలో సెటిల్ అవడమూ అంతే ముఖ్యం. ప్రతీ వ్యక్తి ఎదుగుదల ప్రోగ్రెసివ్‌గా ఉండాలి. ప్రేమ కోసం కుటుంబాన్ని కన్విన్స్ చేయండి. ఇతరులకు ఎలాంటి సమస్యగా మారకుండా ఎదిగి ఆదర్శంగా నిలబడాలి. ఆత్మహత్యలు, అఘాయిత్యాలకు పాల్పడకూడదు. అప్పుడే ప్రేమ బ్రతుకుతుంది. మీరూ నిలబడతారు.

రాజు అని పిలవడమంటేనే నాకు ఇష్టం : నీలిమ

మా మధ్య స్నేహం చిగురించిన నాటి నుంచి నేను ఆయనను రాజు అనే పిలుస్తాను. అలా పిలవడమంటేనే నాకు చాలా ఇష్టం. ఆయన దొరకడం నా అదృష్టం. రాజు ఫర్‌ఫెక్ట్ మ్యాన్. నాయకత్వ లక్షణాలతో పాటు సేవాగుణాలు ఎన్నో ఉన్నాయి. పట్టువీడని విక్రమార్కుడిలా అనుకున్న పని సాధించిపెడతాడు. నేను అండగా ఉన్నానని రాజు చెప్పడం కన్నా నాకు ఆయన తోడుగా ఉండటం గర్వకారణం.

- చేర్యాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి)

ప్రేమికులకు బాసటగా నిలిచిన న్యాయవాది


న్యాయవాది వేణుగోపాలరావు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రేమికులకు బాసటగా నిలిచిన న్యాయవాది వేణుగోపాలరావు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ప్రేమించడం తప్పుకాదని కానీ, ప్రేమికులు సాధ్యమైనంత వరకు పెద్దలను ఒప్పించే ప్రయత్నం చేయాలన్నారు. ప్రేమ విషయం పెద్దలకు చెప్పే ధైర్యం లేకపోతే ప్రేమించడమే వ్యర్థమని హితవు పలికారు. అమ్మాయిలకు వివాహ వయస్సు 17 ఏళ్లు నిండి 18 సంవత్సరాలు రాగానే పెళ్లి చేసుకుంటున్నారని, కానీ వివాహ వయస్సు చట్ట ప్రకారం 18 ఏళ్లు పూర్తయి 19 ఏళ్లు వచ్చి ఉండాలన్నారు. అబ్బాయిలకు 21 ఏళ్లు పూర్తయి ఉండాలని సూచించారు. ప్రేమ సమస్యలను ఎదుర్కొంటున్న యువతీయువకులు, వారి తల్లిదండ్రులు తనను సంప్రదిస్తే ఎలాంటి ఖర్చు లేకుండా ఉచిత న్యాయ సహాయం అందిస్తానని వేణుగోపాలరావు తెలిపారు.

అద్దె ఇంట్లో పరిచయమై.. వివాహ బంధంతో ఒక్కటై


మంత్రి దామోదర్ - పద్మిని దంపతులు

అద్దె ఇంట్లో మొదలైన వారి పరిచయం.. ప్రేమకు, ఆ తరువాత పెళ్లికి దారి తీసింది. ప్రేమ పెళ్లితో పాటు రాజకీయం.. ప్రజా సేవలోనూ కలిసి నడుస్తున్న దంపతులే తూర్పు నిర్మల - జగ్గారెడ్డి. 1985లో సంగారెడ్డి పట్టణంలో రామ్‌నగర్‌లో ఎదురెదురుగా అద్దె ఇళ్లల్లో ఉంటుండగా తొలిచూపులు కలిశాయి. మునిపల్లి మండలం తాటిపల్లికి చెందిన నిర్మల రామ్‌నగర్‌లో ఉంటూ బీఎస్సీ నర్సింగ్ కోర్సు చదివే వారు. జగారెడ్డి రాజకీయంగా అడుగులు వేసిన తొలినాళ్ల నుంచే వారి ప్రేమ ప్రయాణం మొదలైంది. సుదీర్ఘంగా 13 ఏళ్ల పాటు వారి ప్రేమ కొనసాగింది. జగ్గారెడ్డి సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా ఉండగా, నిర్మల స్టాఫ్‌నర్సుగా ఉన్న సమయంలో 1998లో వారు వివాహం చేసుకున్నారు. వీరికి కూతురు జయారెడ్డి, కుమారుడు భరత్ సాయిరెడ్డి ఉన్నారు. జగ్గారెడ్డి ఎమ్మెల్యేగా మూడుసార్లు ప్రభుత్వ విప్‌గా సేవలందించారు. నిర్మలారెడ్డి స్టాఫ్‌నర్సుగా దాదాపు 15 ఏళ్ల పాటు విధులు నిర్వహించారు. ఆ తర్వాత జగ్గారెడ్డి ప్రోత్సాహంతో నిర్మలారెడ్డి రాజకీయాల్లోకి అరంగ్రేటం చేశారు. రాజకీయ ప్రయాణంలో ఇద్దరు ఒకరికొకరు తోడుగా కలిసి ప్రయాణిస్తున్నారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేస్తున్న నిర్మలారెడ్డి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్న జగ్గారెడ్డి సహకారంతో ఇటీవల టీజీఐఐసీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టి ప్రజాసేవలోనూ ముందున్నారు.

- సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి)

ఆదర్శ ప్రేమ వివాహాల వేదిక భూంపల్లి

విప్లవోద్యమాలకు వేదికైన అక్బర్‌పేట - భూంపల్లి మండలంలోని భూంపల్లి గ్రామం ప్రేమ వివాహాలకు పెట్టింది పేరు. ఆ గ్రామంలో విప్లవ పార్టీలు 40 మందికి ప్రేమ, ఆదర్శ వివాహాలను జరిపించింది. విప్లవ పార్టీలు చేసిన చైతన్యంతో ఆ కుటుంబాలు అన్యోన్యంగా కలిసిమెలిసి జీవిస్తున్నాయి.



కులాంతర వివాహాలను ప్రోత్సహించాలి : బోయ శ్రీనివాస్ - సుజాత

దేశంలో కులాలు మతాలు అంతరించి పోవడాకే ప్రేమ వివాహాలను చేసుకున్నాం. ప్రస్తుతంగా మేముమిద్దరం ఆదర్శంగా జీవిస్తున్నాం. నిచ్చెన మెట్ల వ్యవస్థను రూపుమాపడానికి కులాంతర వివాహాలను ప్రోత్సహించాలి. ప్రేమ వివాహాలతో వరకట్న వేధింపులు ఉండవు. పేద కుటుంబాలకు కట్నమిచ్చే బాధలు ఉండవు.

అన్యోన్యంగా జీవిస్తున్నాం : పాపని నాగరాజు - రేణుక



కొంతమందిలో ప్రేమ వివాహాలు చివరిదాక ఉండవని, మధ్యలో విడిపోవడం జరుగుతుందనే అభిప్రాయం ఉంటుంది. కానీ మేము కులాంతర వివాహం చేసుకుని అన్యోన్యంగా జీవిస్తున్నాం. ప్రేమ వివాహాలను చేసుకోవడం ద్వారా ఒకరిని ఒకరూ త్వరగా అర్థం చేసుకోవడం జరిగింది.

- మిరుదొడ్డి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి)

జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలకు సిద్దిపేట క్రీడాకారిణి


బొంగోని రాణి

గజ్వేల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి సీనియర్ మహిళా కబడ్డీ పోటీలకు సిద్దిపేట క్రీడాకారిణి బొంగోని రాణి ఎంపికయ్యారు. సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరేళ్లుగా అనేక రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటూ ప్రతిభ కనబర్చింది. దీంతో పాటు రాష్ట్ర స్థాయి ట్రయల్స్‌కు ఎంపికయ్యారు. ఈ క్రమంలో బుధవారం జరిగిన ఫైనల్ ఎంపికల్లో సత్తా చాటి జాతీయ స్థాయికి ఎంపికైయ్యారు. ఈ నెల 14 నుంచి 18వరకు హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ క్రీడా పోటీల్లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి, అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్‌కుమార్, తదితరులు రాణిని అభినందించారు.

అప్పులోళ్ల వేధింపులతోనే భర్త ఆత్మహత్య

- సీసీ ఫుటేజీ ఆధారంగా విచారణ జరపాలి
- పోలీస్ స్టేషన్‌లో మృతుని భార్య ఫిర్యాదు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సాయిదీప్ సూపర్ మార్కెట్ అధినేత మల్లికార్జున రమేష్ ఆత్మహత్యకు అప్పుల వేధింపులే కారణమని మృతుని భార్య గాయత్రి ఆరోపించారు. ఈ మేరకు గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 11న ఉదయం 7 గంటల ప్రాంత్రంలో ఇంట్లోంచి షాప్‌కు వెళ్లాడని, అక్కడికి అప్పులు ఇచ్చిన వాళ్లు వచ్చి బెదిరించారని, దాంతో మనస్తాపనానికి గురై ఉరివేసుకుని మృతిచెందాడని తెలిపారు. షాపునకు వచ్చి వేధించిన వారి వివరాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయని, విచారణ జరిపి చర్యలు తీసుకొని, న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరినట్లు గాయత్రి తెలిపారు. ఈ విషయంలో పట్టణ సీఐ నాగరాజును సంప్రదించగా మృతిపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు నడుస్తోందన్నారు.

చిరుత సంచారంతో భయం.. భయం

రామాయంపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే ఓ చిరుత రోడ్డు ప్రమాదంలో చనిపోయిందనుకుంటే.. మరో చిరుత ప్రత్యక్షమైంది. అంతేకాదు పశువుల పాకలో కట్టేసిన ఓ లేగ దూడను చంపి తినేసింది. ఈ ఘటన రామయంపేట మండల పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. వివరాల్లోకెళ్తే.. మండలంలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన రైతు దాసరి ఎల్లయ్య రోజులానే బుధవారం సాయంత్రం పొలం వద్ద పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. ఉదయం వెళ్లి చూసేసరికే పశువుల పాకలో ఓ లేగ దూడ చనిపోయి ఉంది. ఫారెస్ట్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని చిరుత ఆనవాళ్లు ఉన్నట్లు తేల్చారు. కొద్ది రోజులుగా ప్రశాంతంగా ఉన్న ఈ ప్రాంతంలో చిరుత సంచారం రైతులు, కూలీల్లో గుబులు పట్టుకుంది. దీంతో అడవిలో కట్టెలు, సీజనల్ పండ్ల సేకరణకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. కాగా, 4వ తేదీన చేగుంట మండల పరిధి వల్లూరు హైవేపై జరిగిన ప్రమాదంలో చిరుత ప్రాణాలొదిలిన విషయం విదితమే. వారం వ్యవధిలోనే రామాయంపేట మండలంలో మరో చిరుత పశువులపై దాడులకు తెగబడింది.

వేసవి వేళ.. రక్త దాతలకు పిలుపు

- ఎండాకాలంలో రక్త నిల్వల కొరత ఏర్పడే అవకాశం
- గట్టెక్కేందుకు దాతల సహకారం అవసరం
- ముందుకొస్తేనే బాధితులకు ఉపశమనం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రాణాపాయస్థితిలో ఉన్న వారికి రక్తం కావాలంటే ఇతరుల నుంచి సేకరించాల్సిందే. రోడ్డు ప్రమాదాలు, ఇతర సంఘటనలు జరిగినప్పుడు రక్తస్రావం ఎక్కువ జరిగి ఎందరో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. వేసవిలో రక్త నిల్వలకు కొరత ఏర్పడే అవకాశం ఉన్నది. ఇంతటి ప్రాముఖ్యత రక్తానికి ఉన్న నేపథ్యంలో దాతలు రక్త దానం చేసేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

దంచికొడుతున్న ఎండలు

వేసవి కాలం పూర్తిగా రాకున్నా.. ఇప్పటినుంచే ఎండలు దంచుకొడుతున్నాయి. వాస్తవానికి వేసవి కాలంలో రక్తదానం చేసేందుకు దాతలతో పాటు ఇతరులు ఆసక్తి చూపరు. ఈ నేపథ్యంలో సర్కారు బ్లడ్ బ్యాంక్‌ల్లో రక్త నిల్వల కొరత ఏర్పడే అవకాశం లేకపోలేదు. ఈ క్రమంలో దాతలు ముందుస్తుగా వచ్చి రక్త దానం చేస్తే తప్పా వేసవి కాలంలో రక్త నిల్వల నుంచి గట్టెక్కే పరిస్థితి ఉండదు.


రక్తదానం చేస్తున్న దాతలు(ఫైల్)

ఏడాదిలో మూడుసార్లు చేయొచ్చు

ప్రతీ మనిషి ఏడాదిలో మూడుసార్లు (90 రోజుల కోసారి) రక్తాన్ని దానం చెయొచ్చు. రక్తదానం చేసే వ్యక్తి 45 కిలోలకుపైగా బరువుతో పాటు 18-55 ఏళ్ల వయస్సు కలిగి ఉన్న వ్యక్తులు చేసేందుకు అర్హులు. సర్కారు బ్లడ్ బ్యాంక్‌లో ఎప్పుడైనా రక్తం దానం చేయవచ్చు. ఎవరు రక్తం దానం చేసిన సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఆ సర్టిఫికేట్ ఉన్న వ్యక్తి కుటుంబసభ్యులకు ఎప్పుడు రక్తం అవసరమున్నా ఉచితంగా ఇస్తారు.

సంగారెడ్డి జీజీహెచ్‌లో బ్లడ్ బ్యాంక్

సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో వేసవిలో ఏర్పడే ఈ రక్త నిల్వల కొరతను అధిగమించేందుకు దాతల సహకారం అవసరం. నారాయణఖేడ్, జహీరాబాద్ ఏరియా ఆస్పత్రుల్లో బ్లడ్ స్టోరేజీ సెంటర్లున్నా..అక్కడికి కూడా ఇక్కడి నుంచే రక్తం యూనిట్లను సరఫరా చేయాల్సి రావడంతో రక్త నిల్వల కొరత సమస్య పెరిగే అవకాశం ఉంటుంది. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ నుంచి నిత్యం సుమారు 10 యూనిట్ల రక్తాన్ని ఇతరులకు ఎక్కించేందుకు తీసుకెళ్తుంటారు. 450 పడకలు కలిగిన ప్రతీనెల 400 యూనిట్ల రక్తం బ్లడ్ బ్యాంక్‌లో అవసరం ఉంటుంది. పాజిటివ్ గ్రూపు బ్లడ్ కంటే నెగటివ్ గ్రూపు యూనిట్ల రక్తం తక్కువగా అందుబాటులో ఉంటుందని సిబ్బంది పేర్కొంటున్నారు. ఈ క్రమంలో రక్తదానం చేసేందుకు దాతల సహకారం అవసరం.

దాతలు ఉదారంగా స్పందించాలి



రక్తదానం ప్రాణ దానంతో సమానం. రక్తదానంపై ప్రజలు అపోహలు వీడి దానం చేసేందుకు ముందుకు రావాలి. ఉదారంగా స్పందిస్తేనే బాధితులకు అవసరమయ్యే రక్త నిల్వలు అందుబాటులోకి వస్తాయి. యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగులు విరివిగా రక్తదానం చేసేందుకు చొరవ చూపాలి. వేసవిలో రక్తనిల్వల కొరత ఏర్పడకుండా దాతలను ముందస్తుగా సమీకరించి పూర్తిస్థాయిలో కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ జి.అనిల్‌కుమార్, సూపరింటెండెంట్, జీజీహెచ్, సంగారెడ్డి

అట్టహాసంగా పాలిటెక్నిక్ క్రీడలు ప్రారంభం

- మూడు రోజులపాటు రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణ

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పాలిటెక్నిక్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వేదికైంది. 2015లో ఏర్పాటు చేసిన ఈ కళాశాలలో తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం విశేషం. మూడు రోజులపాటు కొనసాగనున్న క్రీడా పోటీలను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ క్రీడల్లో కంపాసాగర్, పాలెం, మాల్తుమ్మెద, జోగిపేట, తోర్నాల, రుద్రూరు, మధిర, కంది, జమ్మికుంట, బసంతపూర్, నారాయణపేట కళాశాలల జట్లు పాల్గొంటున్నాయి. ప్రతీ కళాశాల నుంచి 20 నుంచి 25 మంది క్రీడకారులు మొత్తం 211 మంది విద్యార్థులు హాజరయ్యారు. వాలీబాల్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్ త్రోబాల్, టెన్నికాయిట్, రన్నింగ్, జావలిన్ త్రో క్రీడలను నిర్వహించనున్నారు. అలాగే వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ముగ్గుల పోటీలు, పాటలు, నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఒక కళాశాల విద్యార్థి మరో కళాశాలలకు వెళ్లడం వల్ల విద్యార్థుల్లో స్నేహం భావం ఏర్పడుతుందని తెలిపారు, క్రీడలలో గెలుపు, ఓటములు సహజమన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో నైపుణ్యంపై దృష్టి సాదించాలన్నారు. అనంతరం పాలిటెక్నిక్ కళశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి క్రీడలను తోర్నాల కళాశాలలో నిర్వహించడం గర్వకారణమని, ఈ క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు కళశాలకు, అధికారులకు స్వాగతం చెప్పారు. ఈ కార్యక్రమంలో మధ్య మండల వ్యవసాయ ఉప సంచాలకులు డాక్టర్ ఉమారెడ్డి, యూనివర్సిటీ క్రీడా పరిశీలకులు డాక్టర్ సురేష్, జిల్లా వ్యవసాయ అధికారి టి.రాధిక తదితరులు పాల్గొన్నా


క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్లు, విద్యార్థులు

పుకార్లను నమ్మబోం.. అపోహలకు తావివ్వం

సమష్టిగా ఆలయాల అభివృద్ధికి కృషి : మోతే గ్రామస్థుల తీర్మానం

దుబ్బాక, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి) : తమ గ్రామం ఇక నుంచి ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలుగొందేలా, ఎలాంటి అపోహలకు తావివ్వబోమని, పుకార్లను, మూఢవిశ్వాసాలను నమ్మబోమని, మానవత్వాన్ని విరబూసేలా సమష్టిగా ఉంటామని అక్బర్‌పేట- భూంపల్లి మండలంలోని మోతే గ్రామస్థులు గురువారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. 'ఆంధ్రజ్యోతి'లో 'పుకార్ల మోతే' శీర్షికన బుధవారం వెలువడిన కథనంతో స్పందించిన దుబ్బాక సీఐ శ్రీనివాస్, అక్బర్‌పేట-భూంపల్లి ఎస్ఐ హరీష్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం ద్వారా అవగాహన నిర్వహించిన విషయం తెలిసిందే. మాజీ సర్పంచు శ్రీనివాస్, పెద్దలు మోతే నర్సయ్య, బైండ్ల రాములు, నాగభూషణం, చుక్క సత్తయ్యతోపాటు పలువురి ఆధ్వర్యంలో గురువారం ఉదయం మోతేలో గ్రామసభను నిర్వహించారు. గ్రామంలోని రెండు ఆలయాల పూజారుల సమక్షంలో పలు అంశాలపై చర్చించారు. రెండు ఆలయాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామన్నారు. ఇకపై అపోహలు ఉండవని, తాము ఎలాంటి పుకార్లను నమ్మబోమన్నారు. ఆలయాల పవిత్రతను కాపాడే విధంగా గ్రామస్థులమంతా పనిచేస్తామని తీర్మానం చేశారు. గ్రామంలోని వేంకటేశ్వరాలయం కోనేరు పునర్‌నిర్మాణం చేయాలని, గ్రామ నడిమి కంటంలో బొడ్డురాయి ఏర్పాటు చేయడంతోపాటు ఆలయాలను అభివృద్ధి చేసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పురోహితుడు రాంమూర్తి శర్మ మాట్లాడుతూ గ్రామంలో పూజారుల మధ్య వర్గపోరు ఉండదని, తాము దైవసేవలో, గ్రామసేవలో ఉంటామని స్పష్టంచేశారు. గ్రామంపై వచ్చిన కథనాలను తీవ్రంగా ఖండిస్తున్నామని రాంమూర్తిశర్మ, మాజీ సర్పంచు శ్రీనివాస్ తెలిపారు.

న్యూస్ బాక్స్

మందకృష్ణను కలిసిన మాజీ సర్పంచ్

మెదక్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట మాజీ సర్పంచ్ కొమ్మెర పూజితా వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ సింహాచలం హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల పోలింగ్‌స్టేషన్ల ముసాయిదా విడుదల

కొండపాక, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ స్టేషన్ల ముసాయిదాను మండల పరిషత్ అధికారి వెంకటేశ్వర్లు గురువారం విడుదల చేశారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలు ఉండగా.. అందులో పది ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. మండలంలో మొత్తం రూ.26,233 ఓటర్లు ఉన్నారు. అందుకోసం మండలంలోని అన్ని గ్రామాల్లో 46 పోలింగ్ స్టేషన్లను గుర్తించారు.

'చికెన్ విషయంలో జాగ్రత్తలు పాటించాలి'

గజ్వేల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో ప్రజలు చికెన్, చికెన్ సంబంధిత పదార్థాల విషయంలో జాగ్రత్తలు పాటించాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశంలోని పలు ప్రాంతాల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని సూచించిన ఆయన ఈ మేరకు ముందస్తుగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

రేబర్తిలో ఘనంగా ఆంగ్ల దినోత్సవం

మద్దూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలం రేబర్తి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు ఆంగ్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చంద్రభాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి: ఎస్ఐ

మద్దూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ షేక్ మహబూబ్ సూచించారు. గురువారం మండలంలోని గాగిళ్లాపూర్ గ్రామంలో గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఏదైనా సమాచారం ఉంటే 100కు కాల్ చేయాలన్నారు.

'దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి'

కొండపాక, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కొండపాక గ్రామపంచాయతీ సిబ్బంది నర్సింలుపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బర్మ కొమురయ్య, తునికి మహేష్ డిమాండ్ చేశారు. గురువారం కొండపాకలో నర్సింలును పరామర్శించి మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న చిన్నపాటి కార్మికులపై దాడిచేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

15, 16 తేదీల్లో గ్యారాషహీద్ దర్గా ఉర్సు

గజ్వేల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15, 16 తేదీల్లో గ్యారాషహీద్ దర్గా ఉర్సు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ముత్తావలీలు సయ్యద్ మథీన్, జకీయోద్దీన్, గఫార్, పర్వేజ్‌లు తెలిపారు. 15న ముత్తావలీ ఇంటి నుంచి గంధం ఊరేగింపు, కవ్వాలీ కార్యక్రమం ఉంటుందని, 16న దీపాలను వెలిగించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

మాజీ జడ్పీటీసీకి మాతృవియోగం

ధూళిమిట్ట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మద్దూర్ మండల మాజీ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి మాతృమూర్తి గిరి మధురమ్మ(85) గురువారం వృద్ధాప్య, అనారోగ్య కారణాలతో కన్నుమూశారు. శుక్రవారం వారి స్వగ్రామం జాలపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆమె భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

రాంపల్లిలో ట్రాక్టర్ చోరీ

కొండపాక, ఫిబ్రవరి 13 ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ చోరీకి గురైన సంఘటన కొండపాక మండలం రాంపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన నర్సింహులు రోజు మాదిరిగానే తన వ్యవసాయ క్షేత్రంలో బుధవారం రాత్రి ట్రాక్టర్ పెట్టి ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం చూసేసరికి ట్రాక్టర్ కనబడలేదు. నర్సింహులు గ్రామస్థుల సహకారంతో వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో గురువారం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా

● సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్



సిద్దిపేటలోని వార్డు ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా తప్పదని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ హెచ్చరించారు. గురువారం సిద్దిపేటలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డులో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న సమయంలో ఓ మహిళ తన గృహం ఆవరణలో చెత్తను కాల్చడం గమనించి మండిపడ్డారు. ప్రతిరోజు ఉదయాన్నే ఇంటింటికి చెత్త సేకరణకు వచ్చే వాహనానికి తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి ఇవ్వాలని అవగాహన కల్పించి, మరోసారి ఇది పునరావృతమైతే జరిమానా విధిస్తామన్నారు. కోమటిచెరువు వద్ద మహిళలు నీటిని వృథా చేయడం గమనించి వెంటనే పిలిచి, నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అనంతరం 10వ వార్డులోని మహిళలతో ప్రతిరోజు ఉదయాన్నే సమయానికి మంచినీటి సరఫరా, మున్సిపల్ వారి చెత్త సేకరణ వాహనం వస్తున్నాయా అంటూ ఆరా తీశారు. వార్డులో నూతనంగా నిర్మిస్తున్న గృహ నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో వెంటనే నిలిపివేయాలని టీపీవో దేవరాజును ఆదేశించారు. మెదక్ రోడ్డు వైపున మాంసం విక్రయదారుల వద్దకు వెళ్లి మాంసాన్ని స్లాటర్‌హౌస్‌లో వధించారా లేదా అని పరిశీలించి, స్లాటర్ హౌస్‌లో వేసే ముద్ర లేకపోవడంతోజరిమానా విధించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బింగి రాజేశం, నాయకం లక్ష్మణ్ పాల్గొన్నారు.

కోహెడలో జిల్లా విద్యాధికారి ఆకస్మిక పర్యటన



విద్యార్థినితో చదివిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

కోహెడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కోహెడ మండలంలోని జిల్లా పరిషత్, కేజీబీవీ, ప్రాథమిక పాఠశాలలను జిల్లా విద్యాధికారి ఈ.శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని శనిగరం, తంగళ్లపల్లి, కేజీబీవీ, గుండారెడ్డిపల్లి, కూరేళ్ల, లంబాడీతండా, ధర్మసాగర్ పాఠశాలలను ఆయన సందర్శించారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల పఠనాభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులచే పాఠ్య పుస్తకాలను చదివించారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న స్లిప్ టెస్టులు, ఫార్మేటివ్ టెస్టులు, ప్రాక్టీస్ టెస్టుల్లో ఎన్ని మార్కులు వచ్చాయో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో పలు రిజిస్టర్లను తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతీ విద్యార్థికి అపార్‌కార్డు క్రియేట్ చేయాలని, ఎండీఎం యాప్‌లో ప్రతిరోజు విద్యార్థుల సంఖ్యను నమోదు చేయాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు సరళ, ఎస్.పద్మ, ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, వేణుకుమార్, బాల్‌రెడ్డి, కన్యాకుమారి, ఆర్‌శైలజ, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్, రాజమౌళి, తేజ, రవళి, రజిత, కృష్ణవేణి, సీఆర్పీలు రాజేశం, రాజు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు

నంగునూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రిని పురస్కరించుకొని నంగునూరు మండలం ఖాతా మహాదేవస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను మాజీమంత్రి హరీశ్‌రావు గురువారం ఆవిష్కరించారు. అలాగే ఉత్సవాలకు రావాలని ఆలయ కమిటీ చైర్మన్ కాసం సూర్యప్రకాశ్ హరీశ్‌రావుకు ఆహ్వానపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ సర్పంచులు దశమంతరెడ్డి, ఏపీ రాములు, నాయకులు భగవాన్‌రెడ్డి, రాజయ్య, పరమేశ్వర్, గణేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక



ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్న అధికారులు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం 15వ విడత మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులపై అధికారులు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 25 గ్రామపంచాయతీల్లో రూ.4 కోట్ల 93 లక్షలతో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేపట్టిన 1,050 రకాల పనులపై తనిఖీ బృందం ప్రజావేదికలో వెల్లడించింది. రూ.48 వేల జరిమానా విధించి, రూ.65 వేల 800 రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో బాలకిషన్, ఏపీడీ శ్రీనివాస్, జెక్యూసీ సంతోష్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ హరీఫ్, ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో సోమిరెడ్డి, ఏపీవో స్రవంతి, ఈసీశివకుమార్, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి సువర్ణ్ సన్

మద్దూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని హెల్త్ సబ్ సెంటర్ వైద్యాధికారి సువర్ణ్ సన్ సూచించారు. గురువారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సెక్రటరీ మాధవ్‌జాదవ్ అధ్యక్షతన వీహెచ్ఎస్ఎన్‌సీ(విలేజ్ హెల్త్ శానిటేషన్ అండ్ న్యూట్రీషన్ కమిటీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు జాగ్రత్తలు పాటించాలన్నారు. బాలింతలకు, పిల్లలకు వేసే టీకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మల్‌హోత్రి, ఆశాలు యశోద, కవిత, కనకలక్ష్మి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి: భాస్కరరావు



మహిళలకు రుణపత్రాలను అందజేస్తున్న యూబీఐ చీఫ్ జనరల్ మేనేజర్ భాస్కరరావు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలని యూబీఐ చీఫ్ జనరల్ మేనేజర్ భాస్కరరావు తెలిపారు. యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సిద్దిపేటలో వివిధరకాల శిక్షణలు పొందిన 12 మంది మహిళలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం సిద్దిపేట ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో గురువారం రుణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ వివిధ అంశాలపై శిక్షణ పొంది స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలనుకున్న మహిళలకు చేయూతగా ఒక్కొకరికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణ మంజూరు పత్రాలను ఇచ్చామన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ సిద్దిపేట రీజనల్ హెడ్ వికాస్, డిప్యూటీ రీజినల్ హెడ్ రాఘవ, ఆర్సెటీ సంస్థ డైరెక్టర్ రాజలింగం, చీఫ్ మేనేజర్ పద్నీస్, సంజయ్, చైతన్య ఆర్సెటీ సిబ్బంది నజీమ్, నాగరాజు, ప్రశాంత్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లలపల్లి సమ్మక్క జాతర కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులను సన్మానం చేస్తున్న గ్రామస్థులు

కోహెడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తంగళ్లపల్లి గ్రామ సమ్మక్క, సారలమ్మ జాతర కమిటీ అధ్యక్షుడిగా అర్షనపల్లి ముని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద సమావేశం నిర్వహించి కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. గౌరవాధ్యక్షుడిగా పాము సత్తయ్య, ముఖ్య సలహాదారులుగా బండిపల్లి నారాయణగౌడ్, రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా యాటెల్లి రాజమౌళి, ప్రధాన కార్యదర్శిగా పిల్లి అంజయ్యగౌడ్, కోశాధికారిగా పాము బాలయ్య, కార్యవర్గ సభ్యులుగా పిల్లి కనకయ్య, నాగవెల్లి వెంకటేష్, శ్రీరామ్, యాటల శంకర్, చిగిరి కొమురయ్య, పులి నారాయణ, వెల్ది బాలయ్య ఎన్నికయ్యారు.

'తపాస్‌పల్లి నీటితో చెరువులు, కుంటలు నింపాలి'

చేర్యాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలను చేర్యాల ప్రాంతంలోని చెరువులు, కుంటలు నింపాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. గురువారం చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. భూగర్భజలాల నీటిమట్టం తగ్గిపోవడంతో పంటలు ఎండుముఖం పడుతున్న నేపథ్యంలో దేవాదుల నీరే శరణ్యమ య్యాయన్నారు. కొద్దిరోజులకిత్రం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నిబంధనలకు విరుద్ధంగా నీటిని దర్జాగా మళ్లించుకునిపోయినా నోరెత్తని కాంగ్రెస్ నేతలు ప్రస్తుతం మొసలికన్నీరు కారుస్తుండటం తగదన్నారు. జేఏసీ పేరుతో తప్పుడు ప్రకటనలు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు కొంగరి వెంకట్‌మావో, తాడూరు రవీందర్, బద్దిపడిగ కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్ పాల్గొన్నారు.

సమానత్వం కోసం సమరం చేద్దాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాదిగ జాగృతి సంఘం నాయకులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : సమానత్వ సమాజం కోసం సమరం చేద్దామని మాదిగ జాగృతి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్లో సమతా మూర్తి సంత్ శిరోమణి గురు రవిదాస్ మహరాజ్ 648వ జన్మదినం పురస్కరించుకుని ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షెడ్యూల్ కులాల వర్గీకరణ, సామాజిక న్యాయం కోసం 30 ఏళ్లుగా ఉద్యమంలో వివిధ వేదికల ద్వారా ప్రాతినిధ్యం వహించిన వారిని సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాదిగ జాగృతి సంఘం రాష్ట్ర నాయకులు డా. మంద బాబు, వేముల మల్లికార్జున్, బోయ రాజన్, కర్రోళ్ల రవిబాబు మాట్లాడారు. సమానత్వ సమాజం కోసం సమరం చేసిన సమతా మూర్తి సద్గురు సంత్ గురు రవిదాస్ మహరాజ్, బీఆర్.అంబేడ్కర్, మాన్యవర్ కాన్షీరామ్ అని గుర్తు చేశారు. సంత్ గురు రవిదాస్ మహరాజ్ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ జాగృతి సంఘం నాయకులు లింగంపల్లి భాస్కర్, ఎమ్మార్పీఎస్, వివిధ వేదికల్లో పనిచేసిన మాదిగ నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే క్రీడా ప్రాంగణాలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులను ప్రోత్సహించడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా చిన్నకోడూరులో నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను గురువారం మండల సమన్వయకర్త పాల సాయిరాంతో కలిసి వారు ప్రారంభించి మాట్లాడారు. సిద్దిపేటను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దడానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్, బీఆర్ఎస్వై, బీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.

అక్కెనపల్లి శివారులో ఇసుక డంపు స్వాధీనం

నంగునూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా వ్యవసాయ బావుల వద్ద నిల్వ చేసిన ఇసుక డంపుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి 40 టన్నుల ఇసుకను పట్టుకున్నట్లు రాజగోపాలపేట పోలీసులు తెలిపారు. నంగునూరు మండలం, రాజగోపాలపేట పోలీస్‌స్టేషన్ పరిధి అక్కెనపల్లి గ్రామ శివారులోని మోయ తుమ్మెద వాగు సమీపంలో గ్రామానికి చెందిన మామిడి లక్ష్మణ్, జంగోని శ్రీకాంత్‌గౌడ్ కలిసి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక డంపు చేస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, రాజగోపాలపేట పోలీసులు సంయుక్తంగా వెళ్లి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు రాజగోపాలపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతుతో మాట్లాడుతున్న సిద్దిపేట ఏడీఏ పద్మ

చిన్నకోడూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సిద్దిపేట ఏడీఏ పద్మ అన్నారు. మండలంలోని మెట్టుపల్లి, చిన్నకోడూరు గ్రామాల్లో వరి, పొద్దు తిరుగుడు, ఆయిల్‌పామ్ పంటలను గురువారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేసి మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుచేసిన రైతులు అధైర్య పడవద్దని వ్యవసాయ, ఉద్యానవన, ఆయిల్ ఫెడ్ అధికారుల సూచనలు పాటించాలన్నారు. ఇప్పటివరకు మండలంలో 22 మంది రైతుల నుంచి 27 టన్నుల గెలలను ఆయిల్ ఫెడ్ కొనుగోలు చేసినట్లు ఆమె తెలిపారు. అనంతరం డిజిటల్ క్రాప్ సర్వేను ఆమె పరిశీలించి సాగు వివరాలను తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో జయంత్‌కుమార్, ఏఈవో శివకుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వాటర్‌ట్యాంక్



శిథిలావస్థలో ట్యాంకు

మెదక్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : దౌల్తాబాద్ మండల పరిధిలోని దీపాయంపల్లి గ్రామంలో 28 ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్‌ట్యాంక్ శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ట్యాంక్ పెచ్చులూడి కిందపడుతున్నాయి. వాటర్‌మన్ ప్రతిరోజూ నీల్లు విప్పాలంటే భయపడుతున్నాడు. మూడేళ్ల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా.. ఫలితం లేదు. అధికారులు స్పందించి పాత ట్యాంక్‌ను డిస్‌మెంటల్ చేసి నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌కు కనెక్షన్ ఇవ్వాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి

● టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుంచు నరేందర్



గజ్వేల్ ఎస్టీవోతో టీపీటీఎఫ్ నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుంచు నరేందర్, టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి.రాజు డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఏటీవో కార్యాలయాన్ని టీపీటీఎఫ్ గజ్వేల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు తాళ్ల నాగరాజు, గొక విద్యాసాగర్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మెడికల్, జీపీఎఫ్ లోన్స్, పార్ట్ ఫైనల్స్, ఫైనల్ పేమెంట్స్, సరెండర్, ఇతర బకాయిలను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఏటీవో, ఎస్టీవోలకు టీపీటీఎఫ్ డైరీని అందజేశారు.

మహిళా కానిస్టేబుల్ మృతిపట్ల సంతాపం



స్వప్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీఐ శ్రీను, ఎస్ఐ నీరేశ్

చేర్యాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుల్ పైస స్వప్న(30) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. సిద్దిపేట సీపీ అనురాధ మృతురాలి కుటుంబసభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. ఆమె స్వగ్రామమైన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం లింగంపల్లి గ్రామానికి చేర్యాల సీఐ ఎల్.శ్రీను, ఎస్ఐ నీరేశ్‌తో పాటు పోలీసు సిబ్బంది వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం కుటుంబసభ్యులకు రూ.30 వేలు అందజేశారు. స్వప్నకు భర్త, ఇరువురు కుమారులు సంతానం. విధి నిర్వహణ పట్ల అంకితభావంతో పనిచేస్తూ ప్రజలతో మమేకమైన స్వప్న మృతితో స్థానికులు దిగ్భ్రాంతికి లోనయ్యారు.

ఘనంగా సరోజినినాయుడు జయంతి



సరోజినినాయుడు జయంతిలో విద్యార్థులు

చేర్యాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మొట్టమొదటి మహిళా గవర్నర్ సరోజినినాయుడు జయంతిని గురువారం కొమురవెల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు సరోజిని చిత్రపటాన్ని గీసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి నీరజ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే చేర్యాల పట్టణంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమాసురేశ్‌రెడ్డి తదితరులు సరోజినినాయుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ సన్నాహక సమావేశం



కోహెడలో మాట్లాడుతున్న ప్రవీణ్‌రావు

కోహెడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ మండల సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. మండలంలోని తీగలకుంటపల్లిలో బీజేపీ మండలాధ్యక్షుడు జాలిగాం రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి బీజేపీ పార్లమెంట్ కన్వీనర్, ఎమ్మెల్సీ ఎన్నికల హుస్నాబాద్ అసెంబ్లీ ప్రభారీ బోయినిపల్లి ప్రవీణ్‌రావు హాజరై మాట్లాడారు. నిరుద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై గొంతెత్తి గర్జించిన పార్టీ బీజేపీ ఒక్కటేనని వివరించారు. బీజేపీ పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులైన అంజిరెడ్డి, కొమురయ్యను మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హుస్నాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, పార్టీ శ్రేణులు ఖమ్మం వేంకటేశం, పిల్లి నర్సయ్య, మ్యాకాల రజినీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.